క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి పట్టణంలో డ్రెయినేజీలపై ఉన్న ఆక్రమణల తొలగింపునకు మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ చర్యలు చేపట్టారు. 5వ వార్డు రైల్వే స్టేషన్ సమీపంలో డ్రెయినేజీలు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను శుక్రవారం జేసీబీతో తొలగించారు. కొండపల్లి ఖిల్లా ప్రాంతం నుంచి దిగువకు పారే వర్షం నీరు డ్రెయిన్ల ఆక్రమణలతో నివాసాలలోకి చేరుతోందని కమిషనర్ తెలిపారు. ఆక్రమణలు తొలగించి డ్రెయినేజీల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించడం ద్వారా మురుగునీరు సక్రమంగా పారుదల అయ్యేలా చర్యలు చేపట్టామని చెప్పారు. కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ బాలకల ప్లస్–2 పాఠశాల ఇంటర్ మీడియెట్ బాలికలకు నోట్ పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఎంపీసీ, సీఈసీ చదువుతున్న 117 మంది బాలికలకు పాఠశాల హెచ్‌ఎం బి.పద్మలత, ఎస్‌ఎంసీ చైర్మన్ నడుకుదిటి పుష్ప ఒక్కొక్కరికి 12 పుస్తకాల చొప్పున అందజేశారు. వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ ఫార్మసీ కళాశాలకు అటానమస్ హోదా



ఆగిరిపల్లి: మండల పరిధి పోతవరప్పాడులోని ఎన్‌ఆర్‌ఐ ఫార్మసీ కళాశాలకు అటానమస్ హోదా లభించిందని కళాశాల చైర్మన్ వెంకటరావు తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వారు కళాశాలకు 10 సంవత్సరాల అటానమస్ హోదాను కల్పించారని చెప్పారు. సంస్థ ప్రతినిధులు కళాశాల చైర్మన్ వెంకట్రావుకు సర్టిఫికెట్‌ను అందజేశారు.

విద్యుత్ సరఫరాలో మార్పులు

చాట్రాయి: విద్యుత్ సరఫరాలో మార్పులు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని సోమవరం, తుమ్మగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని చెప్పారు.

దుర్గమ్మకు ఆషాఢం సారె



లోపూడి (ముసునూరు): బెజవాడ కనకదుర్గమ్మకు భక్తులు ఆషాఢ సారె, పసుపు కుంకుమ సమర్పించారు. సమరసత ఫౌండేషన్ నూజివీడు ఏరియా ఆర్గనైజర్ పరమేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని లోపూడి శివారు బాసవరప్పాడుకు చెందిన 20 మంది మహిళలు శుక్రవారం విజయవాడకు వెళ్లి, కనక దుర్గమ్మకు ఆషాఢ సారె, పసుపు కుంకుమ, సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

19న మండల పరిషత్ సమావేశం

ముసునూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19న నిర్వహిస్తామని ఎంపీడీఓ పద్మావతీదేవి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరగనున్న సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

స్వామికి శాకంబరి అలంకరణ



పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని పెనుగొలను లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామికి తొలుత పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం నూతన వస్త్రాలు, వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, తులసి దళాలు, ఫలాలతో ప్రత్యేక అలంకరణ చేసి ఆలయ అర్చకులు వెంకటేశ్వరస్వామి విశేష పూజలు చేశారు.

కౌలు హక్కు పత్రాలపై సభలు

నూజివీడు: కౌలు రైతులు సాగు హక్కు పత్రాలను తీసుకోవాలని వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి అన్నారు. గొల్లపల్లి, పల్లెర్లమూడి, ఎంఎస్‌పాలెం, మీర్జాపురం, పోతురెడ్డిపల్లిలో రెవెన్యూ అధికారుల సమన్వయంతో శుక్రవారం కౌలు రైతు హక్కు పత్రాల జారీపై గ్రామసభ నిర్వహించారు. రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం



నూజివీడు మండలంలో సాగుచేస్తున్న మొక్కజొన్న



పోతురెడ్డిపల్లిలో వేసిన వరి నారు మడి

- నూజివీడు నియోజకవర్గంలో 95 వేల ఎకరాల సాగుభూమి
- వరి, పత్తి, మొక్కజొన్న సాగుకు రైతుల మొగ్గు
- వరి నారు మడులు సిద్ధం చేసుకుంటున్న అన్నదాతలు

నూజివీడు: వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం అయ్యారు. పొలాలను సిద్ధం చేశారు. దుక్కులు దున్ని నారు పోశారు. వర్షాలు ఆశించినంతగా కురవకపోయినా ఎంతో ఆశతో సాగుకు సిద్ధమయ్యారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కలిపి వ్యవసాయ భూమి విస్తీర్ణం సుమారు 95వేల ఎకరాల వరకు ఉంది. అయితే ఎక్కువ విస్తీర్ణం బోర్ల కిందే ఉండటంతో బోర్లే ఆధారంగా రైతులు ముందుకు సాగుతున్నారు. అడపాదడపా వర్షాలు పడుతుండడంతో రైతులు వరినారు పోయడం, మొక్కజొన్న విత్తనాలు నాటడం వంటి పనులు పూర్తి చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన విత్తనాలను అందిస్తున్నారు.

వ్యవసాయ కూలీలకు పనులు

నియోజకవర్గంలో ప్రజలకు వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉన్న నేపథ్యంలో ఆరుగాలం పంటలు సాగు చేస్తారు. ఇక్కడ వ్యవసాయ పనులు ప్రారంభమైతే రైతులతో పాటు పేదలు, వ్యవసాయ కూలీలకు సైతం కూలి పనులు దొరుకుతాయి. చాట్రాయి, ఆగిరిపల్లి, నూజివీడు, ముసునూరు మండలాల్లో వరితో పాటు మొక్కజొన్న, పత్తి తదితర పంటలను సాగు చేస్తారు. ఇప్పటికే రైతులు వ్యవసాయ బోర్ల కింద వరినార్లు పోశారు. అలాగే బోర్లు ఉన్న రైతులు మొక్కజొన్నను సైతం సాగు చేస్తున్నారు.

నియోజకవర్గంలో 24,862 వ్యవసాయ బోర్లు

నియోజకవర్గంలోని నూజివీడు మండలంలో 7,142 వ్యవసాయ బోర్లు, ఆగిరిపల్లి మండలంలో 3,855 వ్యవసాయ బోర్లు, ముసునూరు మండలంలో 6,176 బోర్లు, చాట్రాయి మండలంలో 7,689 వ్యవసాయ బోర్లు ఉన్నాయి. గత ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్‌ను రోజుకు పగటిపూటే 9 గంటల పాటు అందించడంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరింది. ఇప్పుడు కూడా అదే పద్ధతి కొనసాగిస్తే రైతులకు ఎంతో అనుకూలంగా ఉండనుంది. మొక్కజొన్న సాగులో రైతులు ఎక్కువగా బిందు సేద్యంను ఉపయోగిస్తున్న నేపథ్యంలో సాగు నీరు వృథా కూడా తక్కువగా ఉంటోంది.

నకిలీ విత్తనాలపై అప్రమత్తత అవసరం

అదను, పదును ఒకేసారి వస్తే విత్తనాలకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో విత్తనాల డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. విత్తనాలు కొనుగోలు చేసిన తరువాత సరిగా మొలకలు రాక పంటను సాగుచేయలేక చేతులెత్తేసే పరిస్థితులు ఎదురవుతాయి. ఈ నేపథ్యంలో రైతులు నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసుకోవాలి. వ్యవసాయాధికారుల సూచనలను రైతులు పాటిస్తే వ్యవసాయం మరింత లాభదాయకంగా ఉంటుంది.

వరి నారుమడుల్లో జింక్, ఇనుము లోపం



నూజివీడు మండలంలో నారుమడులు 10 రోజుల నుంచి 20 రోజుల దశలో ఉన్నాయి. నారుమడుల్లో అక్కడక్కడా జింకు, ఇనుము లోపం కనిపిస్తోంది. జింకు లోపం నివారణకు చిల్లేటెడ్ జింకును ఒక గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. అలాగే ఐరన్ లోపం నివారణకు ఫెర్రస్ సల్ఫేట్ 50 గ్రాములను లీటరు నీటికి కలిపి వరి నారుమడిలో పిచికారీ చేయడం ద్వారా సూక్ష్మధాతు లోపాలను నివారించవచ్చు.

– ఆలూరు చాముండేశ్వరి, వ్యవసాయాధికారి

ఎమ్మెల్యే నివాసం వద్ద ఆశా వర్కర్ల ఆందోళన



తిరువూరు ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు



చంద్రాల పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న ఆశాలు, సీఐటీయూ నాయకులు

తిరువూరు: ఎ.కొండూరు పీహెచ్‌సీలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా విధి నిర్వహణలో అనారోగ్యంతో మృతిచెందిన ఆశా వర్కర్ తోట రాధమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం తిరువూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు నివాసం ఎదుట ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైద్యశాఖాధికారులు ఆశా వర్కర్లపై అధిక పనిభారం మోపుతున్నారని, వారికి కనీసం సెలవు ఇవ్వడం లేదని, పని ఒత్తిడితో అనారోగ్యం బారిన పడే వర్కర్లను గురించి పట్టించుకునే వారు లేరని విమర్శించారు. కార్యక్రమంలో తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చౌటపల్లి, రాజుగూడెం, గంపలగూడెం, ఊటుకూరు పీహెచ్‌సీల ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రాధమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలి

మైలవరం: ఆశా వర్కర్ రాధమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆశా వర్కర్స్ విధులు బహిష్కరించి మైలవరం మండలం చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సుధాకర్ మాట్లాడుతూ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తోట రాధమ్మ కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, అనారోగ్యంతో ఉన్న ఆశా వర్కర్స్‌కు సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వైద్యాధికారి రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ప్రత్తిపాటి జ్యోతి, మండల నాయకులు జయలక్ష్మి, జయ సంతోషం, నాగమణి, రాణి, తేరేజమ్మ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

- **గంపలగూడెం:** మండల ఆశా వర్కర్ల యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం గంపలగూడెం పీహెచ్‌సీ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి జె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎ.కొండూరు ఆశవర్కర్ తోట రాధమ్మ మృతి ఘటనపై ఉన్నతాధికారులతో విచారణ చేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మృతురాలు కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. పలువురు ఆశవర్కర్లు పాల్గొన్నారు.
- **తెల్లదేవరపల్లి(విస్సన్నపేట):** ఆశా వర్కర్ తోట రాధమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ తెల్లదేవరపల్లి పీహెచ్‌సీ వద్ద సీఐటీయూ, ఆశా వర్కర్లు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఆశా వర్కర్ రాధమ్మ కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి. నాగరాజు డిమాండ్ చేశారు. పీహెచ్‌సీ వైద్యుడికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకుడు మేకల జ్ఞానరత్నం, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రమీల, కల్పన, విజయ, కుమారి, దుర్గ, రాణి, సుహాసిని, స్వరూప పాల్గొన్నారు.

నూతన పెన్షన్ రద్దుపై పోరాటానికి సిద్ధం



సమావేశంలో పాల్గొన్న యూనియన్ నాయకులు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే ఉద్యోగుల నూతన పెన్షన్‌ను రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరణకు అలుపెరుగని పోరాటం చేస్తామని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నేతలు స్పష్టం చేశారు. సికింద్రాబాద్, తిరుపతి లాలాగూడా డివిజన్ స్థాయి సమావేశం గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు వద్ద శుక్రవారం జరిగింది. డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బాబూనాయక్, అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్‌ఎఫ్‌ఐఆర్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య నేతృత్వంలో పాత పెన్షన్ పునరుద్ధరణకు రాజీలేని పోరాటానికి కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. డివిజన్ సహాయ కార్యదర్శి గద్ద సురేష్, బ్రాంచి అధ్యక్షుడు శివనాగేశ్వరరావు, వర్కింగ్ చైర్మన్ దాసరి డేవిడ్‌రాజు, సుధాకర్ పాల్గొన్నారు.

పుస్తకాలు, దుస్తుల పంపిణీ

తిరువూరు: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని ఇంటర్మీడియెట్ విద్యార్థినులకు రాష్ట్ర సమగ్ర శిక్షాభియాన్ సరఫరా చేసిన ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంను శుక్రవారం అందజేశారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ రాజు సూచించారు. సమయపాలన, ఏకాగ్రతతో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.



తిరువూరు జెడ్పీ పాఠశాల విద్యార్థినులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసిన అధికారులు

జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు

నూజివీడు: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ప్లస్‌కు చెందిన ఐదుగురు విద్యార్థినులకు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు లభించాయి. రామనోళ్ల రూపశ్రీ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో, గుణ గాయత్రీ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో, షబనా, రేష్మశ్రీ, బత్తుల భువన నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీఎన్ సత్యనారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

- **విస్సన్నపేట:** నరసాపురం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని దారెల్లి కీర్తన ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించిందని పాఠశాల ప్రిన్సిపాల్ ఎంబీడీ శ్యామల శుక్రవారం తెలిపారు. ఆమెను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు అభినందించారు.
- **ఆగిరిపల్లి:** నెక్కలం గొల్లగూడేనికి చెందిన డోల సాత్విక నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఆమె గన్నవరం మండలం వీరపనేని గూడెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివి 600 మార్కులకు గాను 576 మార్కులు సాధించింది. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన సాత్వికను, తల్లిదండ్రులను గ్రామస్తులు అభినందించారు.

చిన్న వయస్సులోనే శాంతి బహుమతి పొందిన మలాలా

తిరువూరురూరల్: చిన్న వయసులోనే శాంతి బహుమతి పొందిన గొప్ప వ్యక్తి మలాలా యూసఫ్ జాయ్ అని, ఆమెను విద్యార్థినులు ఆదర్శంగా తీసుకోవాలని మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. వీరభద్రరావు అన్నారు. జన విజ్ఞాన వేదిక సమతా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాజిక సేవలో మలాలా విశిష్ట వ్యక్తిత్వం కలిగి ఉన్నారని, పేద విద్యార్థినుల చదువు కోసం ఆమె ఆదాయాన్ని ఖర్చు చేస్తున్నారని చెప్పారు. జేవీవీ సమత కన్వీనర్ ఉషారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

తిరువూరు: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జనాభా పెరుగుదలతో వచ్చే అనర్థాలను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు వివరించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన శరణ్య, తపస్వి, ఉదయశ్రీలకు బహుమతులు అందజేశారు. విజేతలను పలువురు అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎన్ రాజు, లయన్స్ సభ్యులు అడుసుమల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, రాజేష్‌ఖన్నా, నాగుబండి ప్రకాశరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

విస్సన్నపేట: మండలంలోని వేమిరెడ్డిపల్లి పంచాయతీ నర్మదానగరం గ్రామం వద్ద పేకాట శిబిరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.17,010 నగదు, పది బైకులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ జి. రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రెడ్డిగూడెం: వర్షాకాలం ప్రారంభం కావడంతో అంటు వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. దీనిలో భాగంగా శ్రీరామపురం పంచాయతీ పరిధిలో డ్రెయినేజీల్లో మురుగు తొలగించి బ్లీచింగ్, సున్నం చల్లించామని చెప్పారు.

వర్షాలకు కూలిన చర్చి ప్రహరీ

చాట్రాయి: మండలంలోని పోలవరంలో అతి పురాతన సీఎస్ చర్చి ప్రహరీ వర్షాలకు కూలిపోయింది. రోడ్డు పక్కనే ఉన్న ప్రహరీ కూలే సమయానికి జన సంచారం లేకపోవడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదని కాలనీ వాసులు తెలిపారు.

పన్నుల వసూలు పూర్తి చేయాలి

జిల్లా పంచాయతీ అధికారి శివప్రసాద్



డీపీఓను సన్మానిస్తున్న సిబ్బంది

తిరువూరు: గ్రామ పంచాయతీలలో ఆస్తి పన్నులు సకాలంలో వసూలు చేయాలని ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి ఎస్‌వీ శివప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాయ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంటిపన్ను మదింపులో నిబంధనల మేరకు వ్యవహరించాలని, పన్ను బకాయిలను నిర్ణీత సమయంలోగా వసూలు చేయాలన్నారు. రక్షిత మంచినీటి సరఫరాలో తగు జాగ్రత్తలు పాటించాలని, వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. తొలిసారి తిరువూరు విచ్చేసిన జిల్లా పంచాయతీ అధికారిని పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు సత్కరించారు. పంచాయతీల విస్తరణాధికారి వెంకటరత్నం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ రమేష్ తెలిపారు. మైలవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, పుల్లూరు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

- **నెమలి(గంపలగూడెం):** విద్యుత్ మెయిన్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో ఊటుకూరు సబ్‌స్టేషన్ పరిధిలోని మూడు గ్రామాల్లో శనివారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ వి. జగదీష్ తెలిపారు. కొణిజెర్ల, నెమలి, ఉమ్మడ దేవరపల్లి గ్రామాల్లో ఉదయం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.
- **నూజివీడు:** విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మత్తుల నేపథ్యంలో శనివారం ఉదయం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ.సత్యనారాయణ తెలిపారు. అమ్మవారి తోట, ఎంప్లాయీస్ కాలనీ, జంక్షన్ రోడ్డు, ఆర్‌ఆర్‌పేట, చిన గాంధీబొమ్మ సెంటర్, కోనేరుపేట, పాతపేట, వెలమపేట, రైతు బజార్, ఏరియా ఆస్పత్రి, గొడుగువారిగూడెం, గాంధీనగర్, స్టేషన్‌తోట, కుమ్మరిపేట, ధండంగార్డెన్, అజరయ్యపేట ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

భూసార పరీక్షల ఫలితాల మేరకు ఎరువుల వినియోగం



మాట్లాడుతున్న శశికళ

రెడ్డిగూడెం: భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడితే సాగు ఖర్చులు తగ్గుతాయని విస్సన్నపేట వ్యవసాయ సహాయ సంచాలకులు కె. శశికళ అన్నారు. రెడ్డిగూడెం మండల వ్యవసాయ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మట్టి పరీక్షలు, పోషకాలు వాటి ఆవశ్యకతను వివరించారు. రైతులు వానపాము ఎరువు, బయో ఫెర్టిలైజర్స్ భూసార పరీక్షల ఆధారంగా వేసుకుంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. నత్రజని మూడు దఫాలుగా భాస్వరాన్ని మొత్తాన్ని మొదటి దుక్కిలో వేయడం ద్వారా వేరు వ్యవస్థ అభివృద్ధి చెందుటకు ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆర్. సురేష్, వీఏఏ సుబ్బారావు పాల్గొన్నారు.

సకాలంలో ఇన్‌కం ట్యాక్స్ చెల్లించాలి

ఇన్‌కం ట్యాక్స్ జాయింట్ కమిషనర్ అభినయ

ఇబ్రహీంపట్నం: ఇన్‌కం ట్యాక్స్ పరిధిలో ఉన్న ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర వర్గాల వారు సకాలంలో ట్యాక్స్ చెల్లించాలని ఇన్‌కం ట్యాక్స్ జాయింట్ కమిషనర్ అభినయ అన్నారు. ఎన్టీటీపీఎస్ ఉద్యోగులకు ఇన్‌కం ట్యాక్స్ చెల్లింపులపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. సదస్సును చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు ప్రారంభించారు. అభినయ మాట్లాడుతూ ఇన్‌కంట్యాక్స్ చెల్లింపుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఇన్‌కం ట్యాక్స్ చెల్లింపు సమయంలో పొరపాటున ఎక్కువ కడితే ఆ సొమ్ము వడ్డీతో సహా రీఫండ్ చేసుకోవచ్చునని వివరించారు. ఉద్యోగుల సందేహాలు నివృత్తి చేశారు. నాగరాజు మాట్లాడుతూ ఉద్యోగులు ఇన్‌కం ట్యాక్స్‌ను సకాలంలో చెల్లించాలని, రిటర్న్ దాఖలు చేయాలని చెప్పారు. తద్వారా ప్రభుత్వ సంక్షేమాన్ని అమలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్టీటీపీఎస్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వంట ఏజెన్సీ నిర్వాహకురాలి తొలగింపు దారుణం

రెడ్డిగూడెం: కుదప గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంతోకాలంగా వంట ఏజెన్సీ నిర్వహిస్తున్న పోతురాజు పద్మావతిని తొలగించి వేరే వారికి అప్పగించడం దారుణమని ఏఐసీటీయూ నాయకులు అన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండా అకారణంగా పద్మావతిని తొలగించారని చెప్పారు. ఏఐసీటీయూ కృష్ణాజిల్లా అధ్యక్షులు దుర్గం పుల్లారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పరికల కళావతి, భూతం మారయ్య పాఠశాలను శుక్రవారం సందర్శించారు. విద్యార్థులను, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పుల్లారావు మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయిని ప్రేమావతి నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పాఠశాలలో 20 ఏళ్లుగా మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీ నిర్వహిస్తున్న పద్మావతిని తొలగించి ఆమెకు తీరని అన్యాయం చేశారని చెప్పారు. ఉన్నతాధికారులు ఈ ఘటనపై విచారణ చేసి హెచ్‌ఎంపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

పంటసాగు హక్కు పత్రాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న తహసీల్దార్ మహ్మద్ మసూద్ ఆలీ

చాట్రాయి: కౌలు రైతులు పంటసాగు హక్కు పత్రాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ మహ్మద్ మసూద్ ఆలీ అన్నారు. కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రాలపై అవగాహన సదస్సు స్థానిక రైతు సేవా కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌలు చేయదలచిన రైతులు భూమి యజమాని నుంచి అంగీకార పత్రం ఇచ్చిన తరువాత హక్కు పత్రాలు ఇస్తామని చెప్పారు. రుణ అర్హత కార్డులు ఉన్న కౌలు రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవచ్చని, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే పంట నష్టపరిహారం వస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి బి.శివశంకర్, బసవారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

15న జగన్నాథ రథయాత్ర

నూజివీడు: పట్టణంలో ఈ నెల 15వ తేదీ మూడు గంటల నుంచి జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తామని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. రాజీవ్ సర్కిల్ వద్ద ప్రారంభమయ్యే ఈ రథయాత్ర బస్టాండు సెంటర్, మున్సిపల్ కార్యాలయం సెంటర్, చిన్న గాంధీ బొమ్మ సెంటర్, పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్, పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ల మీదుగా ధర్మ అప్పారావు కళాశాల వరకు కొనసాగుతుందని చెప్పారు. రాత్రి ఏడు గంటలకు స్వామి వారికి 108 రకాల మహా ప్రసాద నివేదన నిర్వహిస్తారని, అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వివరించారు.

వికాస్ విద్యార్థుల ప్రతిభ

విస్సన్నపేట: పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో వికాస్ పాలిటెక్నికల్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనపర్చారని వికాస్ విద్యా సంస్థల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి శుక్రవారం తెలిపారు. తమ కళాశాలకు చెందిన మొటమర్రి మహాలక్ష్మి 97.4 శాతం మార్కులతో కళాశాల ప్రథమ స్థానం సాధించగా, యడ్ల అభిరామ్ 96.1 శాతం మార్కులతో ద్వితీయ స్థానం, మాటూరి మౌల్యశ్రీసత్య 94.2 శాతం మార్కులతో తృతీయ స్థానం సాధించారని చెప్పారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను చైర్మన్ నర్సిరెడ్డి, ప్రిన్సిపాల్ కె. రమేష్, అధ్యాపకులు అభినందించారు.